# నెల్లూరు ముచ్చట్లు

## సమాచార మంత్రి

రాష్ట్ర సమాచార మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి24 తేది నెల్లూరు వస్తున్నారు. నాలుగైదు రోజులపాటు జిల్లాలోనే వుంటారు.

## బ్యాంకు దొంగ - సొత్తు దొరికాయా?

నెల్లూరు పట్టణంలో సంచలనం రేపిన క్యాథలిక్ సిరియన్ బ్యాంకులో బంగారు, డబ్బు దోచ కెళ్లింది ఆ బ్యాంక్ మాజీ క్యాషియర్ వర్గీస్‌గా పోలీసులు తేల్చారు. వర్గీస్ కేరళ రాష్ట్రంలో మూడు చోట్ల దాచిన సొత్తును నెల్లూరు నుంచి వెళ్లిన పోలీసు బృందం బుధవారం స్వాధీనం చేసుకొన్నట్లు విశ్వసనీయ వర్గాల ద్వారా తెలిసింది. దొంగతనం చేసిన తీరు, సహకరించిన వారి వివరాలు వర్గీస్ నోట వినాలి.

## ఎసిబి దాడి

గుంటూరు కమర్షియల్ టాక్స్ అసిస్టెంట్ కమీషనర్ విజయేంద్రన్ ఆదాయానికి మించి ఆస్తులు కల్గి వున్నాడనే సమాచారంతో, నెల్లూరు టెక్కేమిట్టలోని అతని ఇంటిపై ఎసిబి అధికారులు శుక్రవారందాడి చేశారు. అధికారులు దాడిచేస్తారనే సమాచారం ముందుగానే పసికట్టిన విజయేంద్రన్ విలువైన వస్తువులు, నగదు రహస్య ప్రాంతాలకు తరలించినట్లు సమాచార మందింది.

## డిఎఫ్‌ఐడి నిధులు మళ్లించలేదు

నెల్లూరు మునిసిపాలిటికి డిఎఫ్ఐడి పథకం కింద మంజూరైన 32కోట్ల రూపాయల నిధులను రాష్ట్ర ప్రభుత్వం పక్క జిల్లాలకు మళ్లించలేదని జిల్లా కలెక్టర్ అనంతరాము చెప్పారు. 20తేది కలక్టరేట్‌లోని తన ఛాంబర్‌లో విలేఖరులతో మాట్లాడుతూ డిఎఫ్ఐడి నిధుల మంజూరుకు ఎంపిక చేసిన ప్రాంతాలను బ్రిటిష్ బృందం 19 తేది సందర్శించిందని, లోటుపాట్లుంటే వాళ్లు సరిచేస్తారన్నారు. నిధుల మంజూరుకు అవసరమైన కొన్ని అంశాలపై నిర్ణయాలు తీసుకొనేందుకు ఈ నెలాఖరున మునిసిపల్ కౌన్సిల్‌ను సమావేశపరుస్తున్నానన్నారు. ఈ సమావేశంలో కౌన్సిల్ సరైన చర్చ జరిపి అవసరమైన నిర్ణయాలు తీసుకోగలదన్న ఆశాభావాన్ని కలెక్టర్ వ్యక్తం చేశారు.

## హైదరాబాద్ చేరిన అనాధ పాప

ఏ తల్లి కన్నాక భారమనిపించిందో నెల్లూరు విజయమహల్ గేటు సమీపంలోని సిద్దార్థ చిన్న పిల్లల ఆస్పత్రి మెట్లపై వదలి వెళ్లిన పురిటిపాపను మంగళవారం స్త్రీ, శిశు సంక్షేమ శాఖ అధికారిణి కరుణ స్వాధీనం చేసుకొన్నారు. వెనువెంటనే హైదరాబాద్‌లో స్త్రీ, శిశు సంక్షేమ శాఖ నేతృత్వంలో నడిచే అనాధ పిల్లల కేంద్రానికి పంపారు. 12 తేది తమ ఆస్పత్రి మెట్లపై దొరికిన ఈ పాపను చిన్నపిల్లల డాక్టర్ జడ్.శివ ప్రసాద్, ఆయన భార్య డాక్టర్ ప్రసన్నలు ఆలనా, పాలనా చూసి కంటికి రెప్పలా కాపాడారు. పోలీసులు, జిల్లా ఉన్నతాధికార్లకు ఈ విషయం తెలియజేశారు. అందమైన ఈ పాపను, కన్నతల్లి వదలి వెళ్లిందన్న వార్త పత్రికల్లో రావడంతో ఈ పాపను పెంచుకోవడానికి పలువురు బిడ్డలులేని దంపతులు ముందుకొచ్చారు. కాని దత్తత చట్టం కఠినతరంగా వుండడం వల్ల ఈ పాపను ప్రభుత్వానికి డాక్టర్ దంపతులు అప్పగించాల్సి వచ్చింది. ఈ పాపపై మమకారం వీడని దంపతులు హైదరాబాద్ శిశు సంక్షేమ కార్యాలయంలో సంప్రదించవచ్చు.

## పశువుల కాపరులైన పోలీసులు

గురువారం రాత్రి పట్టణ ట్రాఫిక్ పోలీసులు పశువుల కాపరులయ్యారు. టౌన్‌లో తరచూ ట్రాఫిక్‌కు ఇబ్బంది కలిగిస్తున్న పశువులన్నింటిని ఒకేసారి తోలుకెళ్లారు. పోలీసుల లాఠీలకు ప్రజలు భయపడతారేమోగాని, పశువులు భయపడతాయా? బందెల దొడ్డి చేరే వరకు అవి ట్రాఫిక్ పోలీసులను ముప్పుతిప్పలు పెట్టి మూడుచెరువుల నీళ్లు తాగించాయి.

## వసంతలక్ష్మికి అవార్డు

నెల్లూరులోని వసంతలక్ష్మి ఛారిటబుల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ శ్రీమతి వసంతలక్ష్మికి యంగ్ అచీవ్‌మెంట్ ఆఫ్ ఇండియా అవార్డు ప్రదానం చేశారు. ఇండియన్ జూనియర్ ఛాంబర్ ఆధ్వర్యంలో ఒరిస్సాలోని బరంపురంలో జరిగిన సమావేశంలో వసంతలక్ష్మి ఈ అవార్డును స్వీకరించారు. తమిళనాడు, కర్ణాటక, కేరళ, ఒరిస్సా, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలో వివిధ రంగాలలో అత్యుత్తమ సేవలు అందించిన నలుగురికి ఇండియన్ జూనియర్ ఛాంబర్ ఈ అవార్డు ప్రదానం చేస్తుంది. మానవతా రంగంలో ఉత్తమ సేవలు చేసినందుకు వసంతలక్ష్మికి ఈ అవార్డునిచ్చారు. తాను చేసిన సేవలకు అనతి కాలంలోనే ప్రతిష్టాకరమైన అవార్డు పొందిన వసంతలక్ష్మి భవిష్యత్తులో సేవారంగంలో తన పరిధిని విస్తరించి మరెన్నో అవార్డులు అందుకోవాలని ఆకాంక్షిస్తున్నాం. వసంతలక్ష్మికి వెన్నుదన్నుగా నిలచి ప్రోత్సహిస్తున్న ఆమె భర్త డాక్టర్ రవికుమార్ అభినందనీయుడు.

## డిఇఓను భయపెట్టిందెవరు?

జిల్లాలో విద్యాశాఖ భ్రష్టు పట్టి పోయింది. అవినీతి, ఆశ్రిత పక్షపాతం, ప్రభుత్వ నిబంధనల ఉల్లంఘన నిత్య కృత్యమై పోయింది. అదేం దురదృష్టమో కాని ఈ మధ్య డిఇఓలుగా జిల్లాలో పనిచేసిన జయచంద్రకుమార్, రామలింగం పలు వివాదాల్లో మునిగి తేలారు. ఏడాది క్రితం తెలంగాణా ప్రాంతం నుంచి డిఇఓగా వచ్చిన నరసింహారెడ్డి పైకి మెత్తగా కనపడ్డా, లోపాయకారి పనులు చేయడంలో మహా నేర్పరి. ఈ మధ్య జరిగిన టీచర్స్ బదలీలు, ప్రమోషన్ల కౌన్సిలింగ్‌లో పలు వివాదాస్పద నిర్ణయాలతో ఉపాధ్యాయ లోకంలో శత్రువులను పెంచుకొన్నారు. ఈ నేపథ్యంలో మిలటరీ కాలనీలో డిఇఓ అద్దెకుంటున్న గదివద్దకు బుధవారం తెల్లవారుజామున కొందరు వ్యక్తులు వెళ్లి ఆయనపై దాడికి ప్రయత్నించారు. సెలవు పెట్టి వెళ్లమని ఆయనను హెచ్చరించారట. డిఇఓ ధైర్యస్తుడు కావడంవల్ల వారిపై తిరగబడడంతో కొట్టను వచ్చిన వాళ్లు వెనక్కు వెళ్లిపోయారట. ఈ విషయం జిల్లా అధికార యంత్రాంగంలో చర్చనీయాంశ మయ్యింది. ఈ మధ్య జిల్లాలో కిడ్నాపర్లు, స్మగ్లర్లు, చీటింగ్ రాయుళ్లుగా మారిన ఉపాధ్యాయులు సరికొత్త రౌడీ అవతారాలే డిఇఓను బెదిరించినట్లున్నాయి. ఎప్పుడో వీధిన పడి పోయి వున్న విద్యాశాఖను కలెక్టర్ సంస్కరించాల్సి వుంది.

## గోపాలయ్య వృద్ధుల ఆశ్రమం

మురళీకృష్ణ గ్రూప్ ఆఫ్ హోటల్స్ అధినేత గ్రోను గోపాలయ్య మైపాడు రోడ్డులో స్వంత నిధులు వెచ్చించి నిర్మించిన మాతాశ్రీ అన్నపూర్ణేశ్వరి వృద్ధుల ఆశ్రమాన్ని 24 తేది సమాచార మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి ప్రారంభిస్తారు. ఈ కార్యక్రమంలో ఎమ్పీ రాజేశ్వరమ్మ, సినీ నేపథ్య గాయకుడు బాల సుబ్రహ్మణ్యం, జిల్లాలోని ఎమ్మెల్యేలు, పలువురు రాజకీయ నాయకులు పాల్గొంటారు. సంపాదించిన మొత్తంలో కొంత వృద్ధుల సేవకు వెచ్చిస్తున్న గోపాలయ్య అభినందనీయుడు.


# శుభాభినందనలు




ఓర్పుతో, ఓదార్పుతో సేవారంగంలో విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టి వందలాది ఉచిత వైద్య శిబిరాల నిర్వహణలో మోడు వారిన పేదల బ్రతుకుల్లో నవవసంతం నింపిన

**వసంత లక్ష్మి ఛారిటబుల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ**

**శ్రీమతి టి.వసంతలక్ష్మి గారికి**

ఒరిస్సా రాష్ట్రం బరంపురంలో సమాజ సేవా రంగంలో **"యంగ్ అచీవ్‌మెంట్ ఆఫ్ ఇండియా"** అవార్డు ప్రదానం చేసిన సందర్భంగా శుభాభినందనలు. ఈ సత్కారం, మరెన్నో సత్కారాలకు ప్రేరణకావాలని ఆశిస్తూ....

**సిబ్బంది మరియు డాక్టర్లు**

**రవి చిన్నపిల్లల హాస్పిటల్**

పొగతోట, నెల్లూరు. ఫోన్: 2328562, 2326228 (ఫోన్ సర్వీస్), 2328333 (ఎమర్జెన్సీ కాల్)


Edited, Printed and Published by N. Dolendra Prasad at Zaminryot Press Ph: 091-861-327354, Offset Printing at Zaminryot Press, Nellore